ప్రజాశక్తి
మంగళవారం 18 ఫిబ్రవరి 2025
5
శ్రీ సత్యసాయి





దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ చేతన్

బాలారిష్టాల నడుమనే కేంద్రీయ విశ్వవిద్యాలయం



◆ ఇప్పటికీ పూర్తవని మౌలిక సదుపాయల కల్పన

◆ రెండేళ్లుగా నిధుల కేటాయింపుల్లేవ్..!

◆ భద్రతపై విద్యార్థినుల్లో ఆందోళన

◆ ఫీజుల భారమూ అధికమే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటై ఇప్పటికి ఏడేళ్లు గడుస్తున్నా అది బాలరిష్టాలను దాటలేదు. యూనివర్సిటీలో ఇప్పటికీ పూర్తి స్థాయి మౌళిక సదుపాయల కల్పన జరగలేదు. ఇంతకాలం తాత్కాలిక భవనాల్లోనే నడుస్తూ వచ్చిన విశ్వవిద్యాలయం ఈ ఏడాది ఆగస్టులో శాశ్వత క్యాంపస్ ఉన్న జంతలూరుకు మార్చారు. ఇక్కడ ప్రారంభమైనప్పటికీ మౌలిక సదుపాయల కల్పన ఇంకా పూర్తవలేదు. ఒకవైపు పనులు నడుస్తుండగానే... మరోవైపు విద్యార్థులను అందులో చేర్చారు. ఈ పనుల నడుమ విద్యార్థినుల భద్రతపై ఆందోళన నెలకొంది. తరచూ బయటి వ్యక్తులు వసతి గృహంలోకి వచ్చేస్తుండటంతో విద్యార్థినులు భయపడిపోతున్నారు. రక్షణ కల్పించాలని ఆందోళనలు చేపడుతున్నారు. తాజాగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యార్థులనులు ఉన్న గదుల్లోకి తొంగిచూశారంటూ యూనివర్సిటీలో ఆందోళన కొనసాగింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు విద్యార్థినులు ఆందోళనలు కొనసాగించారు. ఇదే రకమైన ఇబ్బందితో గతేడాది డిసెంబర్ 8వ తేదీన కూడా విద్యార్థినులు ఆందోళనలు చేశారు.



తమకు రక్షణ కల్పించాలని కోరుతూ యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

రెండేళ్లుగా పైసా నిధుల్లేవ్..!

కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధుల కేటాయింపులు జరపకపోవడంతోనే సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణపు పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్ల క్రితం కేటాయించిన రూ.125 కోట్లతోనే ఇప్పటికీ నెట్టుకొస్తున్నారు. గత బడ్జెట్‌లోగానీ, ఈ బడ్జెట్‌లోగానీ యూనివర్సిటీకి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ఒక అడకమిక్ బ్లాక్‌తోపాటు, రెండు వసతి గృహ భవనల నిర్మాణాలు మాత్రమే జరిగాయి. ఇందులో ఒకటి బాలురకుకాగా, మరొకటి బాలికలకు ఉంది. మొత్తం విశ్వవిద్యాలయంలో 900 మందికిపైగా విద్యార్థులుండగా 350 మంది బాలికలున్నారు ఈ బాలికల వసతి గృహం నిర్మాణం పనులు పూర్తవకనే ప్రారంభించారు. దీంతో పనిచేసేందుకు వచ్చిన వారు బాలికల వసతి గృహంలోకి ప్రవేశిస్తున్నారు. ఈ సమయంలో బాత్‌రూమ్‌ల్లోకి తొంగి చూస్తున్నారని విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు. తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు. గతంలోనూ పలుమార్లు విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన సిసి కెమోరాలు సక్రమంగా పనిచేయడం లేదు. విద్యుత్ సౌకర్యం లేకపోతే ఆవి పనిచేయడం లేదు.



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు

విద్యార్థులకు రక్షణ కల్పించాలి

ఎస్పీకి ఐద్వా, ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి

కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థినులకు పూర్తి స్థాయి రక్షణ కల్పించాలని జిల్లా ఎస్పీ జగదీశ్‌ను ఎస్ఎఫ్ఐ, ఐద్వా నాయకులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ విద్యార్థినులున్న వసతి గృహానికి సరైన రక్షణ లేకపోవడంతో బయటి వ్యక్తులు లోపలికి వస్తున్నారని తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు కూడా విద్యుత్ లేని సమయంలో పనిచేయడం లేదని చెప్పారు. 16న వర్సిటీలో జరిగిన ఘటనపై సమగ్రమైన విచారణ జరిపించాలన్నారు. యూనివర్సిటీ హాస్టల్ భవనాల వద్ద తొంగి చూస్తున్న వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ మొత్తం సీసీ కెమెరాలు మొత్తం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు చంద్రిక, అశ్విని, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు భీమేష్, పట్టణ కార్యదర్శి శివ, పట్టణ ఉపాధ్యక్షులు సోము పాల్గొన్నారు.

ఫీజుల భారమూ అధికమే

కేంద్ర ప్రభుత్వం తగినంతగా నిధులు కేటాయించకపోవడంతో నిర్వహణకు అయ్యే ఖర్చును విశ్వవిద్యాలయం విద్యార్థుల నుంచే పిండుతోంది. అన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఏడాదికి ఫీజు రూ.1800 వరకుంటే ఇక్కడ మాత్రం రూ.10 వేల వరకు ఉంది. ఇంత భారాన్ని మోపడం సరైంది కాదని విద్యార్థులు కోరుతున్నా పాలకవర్గం పట్టించుకోవడంపైగా బాగా ఈ విషయంపై నిరసన తెలిపితే మీకు భవిష్యత్ లేకుండా చేస్తామని పరోక్ష హెచ్చరికలు చేస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

యూనివర్సిటీలో ఎంపీ, ఎమ్మెల్యే తనిఖీ



విద్యార్థినులతో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ

విద్యార్థినుల ఆందోళనలతో అట్టుడుకుతున్న జంతులూరు సెంట్రల్ యూనివర్సిటీని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. యూనివర్సిటీలో మౌలిక సదుపాయాల కల్పనలో యూనివర్సిటీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదంటూ ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 8న యూనివర్సిటీలో ఇలాంటి ఘటన చోటు చేసుకోగా రాష్ట్ర గవర్నర్, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశానని తెలిపారు. వైస్ ఛాన్సలర్ ఎస్ఏ.కోరి నిర్లక్ష్యం, విధుల పట్ల బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకుంటామన్నారు. యూనివర్సిటీలో 24 గంటలూ పని చేసేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. నాశిరకం భోజనం ఇస్తున్న ఏజెన్సీని కూడా మారుస్తామని విద్యార్థినులకు తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ సమస్యలపై అందించే అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలియజేశారు. సోమవారం ఉదయం కదిరి ఆర్డీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి 420 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గ స్థాయిలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు దృషి సారించాలన్నారు. న్యాయపరమైన సమస్యలు లేని అన్ని అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో వివిఎస్.శర్మ, డిపిఒ సమత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు

రీజనల్ ఆడిట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ నాగేంద్ర

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో అధికారులు అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు లభిస్తే వారిపైన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని రీజనల్ ఆడిట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ నాగేంద్ర అన్నారు. రెండు రోజుల క్రితం హిందూపురం వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై ప్రజాశక్తి దినపత్రికలో 'పన్నుల శాఖలో పైసా వసూల్' అనే కథనం వెలువడింది. దీనిపై స్పందించిన రీజనల్ ఆడిట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ సోమవారం హిందూపురం వాణిజ్య పనుల శాఖ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ కృష్ణవేణితో పాటు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌ను ఇతర అధికారులను ఆయన విచారణ చేశారు. అదేవిధంగా పట్టణంలో డీలర్లు, వివిధ వ్యాపారాల అసోసియేషన్ నాయకులతో అధికారుల తీరుపైన విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఎప్పుడూ లేనివిధంగా హిందూపురం సర్కిల్ లో అధికారులు అవినీతికి పాల్పడినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేసి నివేదికను సమర్పించాలని తనకు ఆదేశించడం జరిగిందన్నారు. అందులో భాగంగా ప్రాథమిక విచారణ చేపట్టామన్నారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ఈ విచారణలో ఈయనతో పాటు జాయింట్ కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ కమిషనర్ మురళీ మనోహర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న రీజనల్ ఆడిట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ నాగేంద్ర

ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - తలుపుల

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారిణి ఫైరోజ్ బేగం సోమవారం తనిఖీ చేశారు ఆరోగ్య కేంద్రంలో మందులు నిలువ ఉన్న ల్యాబ్ ను పరిశీలించారు. సిబ్బంది ఆస్పత్రికి వచ్చే రోగులను మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేంద్రనాయక్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, స్థానిక వైద్య అధికారులు అల్తాఫ్, అశ్రిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి హేయం : సిపిఎం

ప్రజాశక్తి - పెనుకొండ

మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాలనాయుడు దాడికి పాల్పడం హేయమైన చర్య అని ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం నాయకులు హరి అన్నారు. మంత్రిపై వార్తలు రాస్తే చంపుతా అంటూ బెదిరించడం అధికార పార్టీ నాయకులకు తగదన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండే విలేకరులపై ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడడం శోచనీయమన్నారు. నాయకులు తప్పు చేస్తే సరి చేసుకోవాలి గాని ఇలాంటి చర్యలకు పాల్పడడం తీవ్రంగా పరిగణించాలన్నారు. విలేకరులపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్ట్ సంఘాలు ఖండన : ప్రజాశక్తి విలేకరిపై దాడి చేసిన అధికార పార్టీ నాయకుడు వేణుగోపాల నాయుడు పై తక్షణం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పలు జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. విధి నిర్వహణలో ఉన్న విలేకరులపై దౌర్జన్యాలు దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జర్నలిస్ట్ సంఘాల నాయకులు అన్నారు. అధికార పార్టీ నాయకుడిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

కందుల కొనుగోలును నిరాకరించడం అన్యాయం

ప్రజాశక్తి - రొద్దం

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ కంపెనీ రైతులనుంచి కందుల కొనుగోలును నిరాకరించడం అన్యాయమని పలువురు రైతులు వాపోయారు. ఈనెల 13వ తేదీ పంపించిన దాదాపు 260 పాకెట్ల కందును సోమవారం వెనక్కి పంపించారని బాధిత రైతులు వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకరిద్దరి రైతులకు చెందిన కందులు సరిగా లేవని చెబుతూ మొత్తం కందుల లారీని వెనక్కు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో అధికశాతం మంది రైతులు కందిపంటను సాగు చేశారని చెప్పారు. ఎదో ఒక కారణం చెప్పి కందుల కొనుగోలులో రైతులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. కంది మద్దతు ధర 7750 రూపాయలుగా ప్రభుత్వం ప్రకటించడంతో ఎంతో సంతోషపడ్డామని ఇలా ఏజెన్సీ వారు కందులను కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. దాదాపు నాలుగు రోజులుగా కందుల కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నామన్నారు. ఇప్పటికైనా స్పందించి కందులను కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాధవ నాయుడు, మధు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కందుల నాణ్యతను చూపుతున్న రైతులు

అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

బిసి సంక్షేమ హాస్టల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు సాంబ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు స్థానిక నాయకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ టీఎస్. చేతన్‌కు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఆప్కాస్ విధానాన్ని యధావిధిగా కొనసాగించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి తిరిగి పాత పద్ధతిన కాంట్రాక్టర్ల వ్యవస్థ తీసుకొస్తామని మంత్రి మండలి సమావేశంలో తీర్మానం చేసిందని ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించి ఆప్కాస్ వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బత్తల సాంబశివ, కన్వీనర్ చంద్రమౌళి ,కన్వీనర్లు శివప్రసాద్, నిర్మల, ప్రశాంత్, రఘురామయ్య తో పాటు కదిరి డివిజన్‌లోని కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధరల పెరుగుదల నివారణకు చర్యలు తీసుకోవాలి : ఐద్వా



వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు


ప్రజాశక్తి-పెనుకొండ

ధరల పెరుగుదలపై తక్షణం చర్యలు తీసుకోవాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఐద్వా (మహిళా సంఘం) విజ్ఞప్తి చేసింది. సోమవారం పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్‌కు ఐద్వా నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ (ఐద్వా) దేశ వ్యాప్తంగా ఆందోళన చేస్తోందన్నారు. ఈ ఆందోళన ద్వారా రాష్ట్ర పతి, ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదల వల్ల ప్రజల జీవనం పై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు మహిళలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు కాలేదని తగినంత ఉపాధి లేక వలసలు అధికమయ్యాయని వారు వివరించారు. మహిళలు కార్మికులు, కర్షకులుగానే కాకుండా కుటుంబ బాధ్యతలు నిర్వహించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పేద ప్రజలపై ఒత్తిడిని మరింత తీవ్రతరం చేశాయన్నారు. కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సిపిఐ) హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ (డబ్ల్యూపిఐ) నమోదైన పెరుగుదల ఈ పరిస్థితిని ప్రతిబింబిస్తోంది అని తెలిపారు. ఆహార ఉత్పత్తులు, పెట్రోల్, గ్యాస్ వంటి అవసరమైన వస్తువుల ధరల పెరుగుదల వల్ల కుటుంట ఖర్చులు సాధారణ ప్రజల ఆదాయాలను మించుతున్నాయని వాపోయారు. జీఎస్టీ పేరుతో భారాలు మరింత పెంచారని విమర్శించారు. ప్రభుత్వ పౌర సరఫరా వ్యవస్థ ద్వారా ఆహారధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువులను తక్కవ ధరలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి పని రోజుల సంఖ్యను 200 రోజులకు పెంచి, కనీస వేతనాల హామీని అమలు చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు సబ్సిడీలను కొనసాగించాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలన్నారు. బ్యాంకుల ద్వారా మహిళా స్వయం సహాయక బృందాలకు రుణాలను సులభతరం చేయాలన్నారు. నగదు బదిలీ కాకుండా వాగ్దానం మేరకు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా నాయకులు గౌతమి, సుమిత్ర , కాంతమ్మ , కవిత తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా శ్రీనివాసులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా ప్రముఖ అడ్వకేట్ నినుమామిడి శ్రీనివాసులు నియమితులయ్యారు. సోమవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగా, శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద చేతుల మీదుగా నియామక పత్రాన్ని న్యాయవాది శ్రీనివాసులు అందుకున్నారు. స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా ఆయన ఇకపై మున్సిపాలిటీకి సంబంధించిన లీగల్ సమస్యలను పరిష్కరించడానికి పనిచేయనున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ అనతి కాలంలోనే న్యాయవాదిగా శ్రీనివాసులు మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో లీగల్ సమస్యల వ్యవహారాలను చక్కదిద్దాలని ఆయనకు సూచించారు. అనంతరం న్యాయవాది మాట్లాడుతూ తనపై నమ్మకంతో ప్రభుత్వం సభ్యుడిగా నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.



పల్లెకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసులు

పట్టణాన్ని సుందరంగా ఉంచడమే ధ్యేయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అధికారులు, కార్మికులు పనిచేయాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం తెల్లవారుజామున నాలుగో డివిజన్‌లో చైర్మన్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హిందూపురం పట్టణ వ్యాప్తంగా మెరుగైన పారిశుధ్య పనులు ఉండాలన్నారు. పారిశుధ్యం లోపించినట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సంబంధిత కార్యదర్శులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ నిజాముద్దీన్, మున్సిపల్ పారిశుధ్య విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా శెట్టిపి సూర్య ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా శెట్టిపి సూర్య ప్రకాష్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పుట్టపర్తిలో సోమవారం జరిగిన సమావేశంలో సత్యసాయి జిల్లా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ సంఘం అధ్యక్షుడిగా ధర్మవరం పట్టణానికి చెందిన శెట్టిపి సూర్య ప్రకాష్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా హిందూపురం పట్టణానికి చెందిన ముక్తియార్, ప్రధాన కార్యదర్శిగా రామ్ మోహన్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా కదిరి పట్టణానికి చెందిన వినోద్, అడ్వైజర్ కమిటీ మెంబర్ గా మల్లికార్జునను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు చెందిన అన్ని ప్రయివేటు, మెడికల్ ల్యాబ్ లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ నవీన్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్స్ సురేంద్ర రెడ్డి, ప్రతాప్ రెడ్డి, గోపాల్ రెడ్డి, అనిల్, ఇమ్రాన్, అబ్దుల్లా, అంజితో పాటు జిల్లాకు చెందిన అన్ని నియోజవర్గాల ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

పగటిపూట విద్యుత్ ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి గాండ్లపెంట

వ్యవసాయ రంగానికి పగటిపూట కరెంటు ఇవ్వాలని మండల పరిధిలోని కొట్లపల్లి పోతవాళ్లపల్లి దోరలాల జీన్లకుంట తదితర గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక సబ్ స్టేషన్‌లో లైన్ ఇన్స్‌పెక్టర్ నరసింహులుకు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత వారం నుంచి పగటిపూట ఐదు గంటలు రాత్రి నాలుగు గంటలు కరెంటు సరఫరా చేన్నారని అన్నారు. రాత్రిపూట బోరు బావులు వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పగటిపూట మాత్రమే విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు కేకే రాజారెడ్డి, మాజీ సర్పంచి కె రవీంద్రారెడ్డి, అజీమ్ బాషా,కొండారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో, మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పుట్టపర్తి పీహెచ్సీ వైద్యురాలు జోష్న పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలోని బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి పౌష్టిక ఆహారం, సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించి పౌషిక ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చున్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండటంతో పాటు బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ జమునాబాయి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ శివ జ్యోతి, వార్డెన్ రాధా, ఆరోగ్య కార్యకర్తలు అనురాధ, భార్గవి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం పూర్తి చేయడానికి నిధులు మంజూరుకు సహకరించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బుల్ హుస్సేన్, టిడిపి నాయకులు కోరారు, పుట్టపర్తి లోని క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రిని కలిసి కళాశాల భవనానికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం నాయకులు దేవి శెట్టి సంజీవ రాయుడు, సీనియర్ నాయకులు చిన్నకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి

ప్రజాశక్తి - అమడగూరు

మండలంలోని గాజులపల్లి, కొలిమి రాళ్లపల్లిలోని అర్హులకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిటికి మహేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కిష్టప్ప, తాడిపత్రి వెంకటనారాయణ, డేరంగుల శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలమీట్

ప్రజాశక్తి- పరిగి

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. ఎంపీపీ సవిత ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించే ఈ సర్వసభ్య సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

భగీరథ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పరిగి

మండల పరిధిలోని వన్నంపల్లి పంచాయతీ పరిధిలోని జంగాలపల్లి లో భగీరథుడు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎంపీ పార్థసారథి విగ్రహాన్ని ఆవిష్కరించారు. మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ జ్యోతులతో భగీరథ విగ్రహానికి జ్యోతుల ఉత్సవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, జెడ్పిటిసి సూర్యనారాయణ, సర్పంచి బాలాజీ, మారుతి ప్రసాద్, శాసనకోట వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్, పరిటాల శివ, డీలర్ రామాంజితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చింత ఫలసాయం వేలం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని పులిమితి పంచాయతీ పరిధిలోని చింత చెట్ల ఫలసాయం వేలం పాటను సోమవారం నిర్వహించారు. ఇఒఆర్‌డి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటను రాము అనే వ్యక్తి దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో సర్పంచి అశ్వర్థనారాయణ, పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటిపరీక్షలు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండలంలోనిరోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. డాక్టర్ హరిత, కంటి వైద్య నిపుణులు భరత్, మెడికల్ ఆప్తలమిక్ అధికారి ఉరుకుందప్ప, డాక్టర్ గోవర్ధన్ నాయుడు మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 30 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు.

క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి - మడకశిర

ఈస్ట్ గోదావరి జిల్లాలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనపర్చిన పట్టణంలోని వెటర్నరీ కాలేజీ విద్యార్థులను మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సోమవారం అభినందించారు. వెటర్నరీ కాలేజ్ విద్యార్థులు క్రీడా పోటీలలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వి శివకుమార్ రెడ్డి అన్నారు. ప్రతిభా విద్యార్థులను టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, యూనిట్ ఇంచార్జ్ రమేష్, ఈశ్వర్ కళాశాల సిబ్బంది అభినందించారు.

చుక్కల భూముల సమస్యలు పరిష్కరించాలి

ముదిగుబ్బ : మండలంలో నెలకొన్న చుక్కల భూముల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆపార్టీ ఆధ్వర్యంలో మండల రైతులు సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు, నాయకులు తిప్పయ్య, గంగిరెడ్డిపల్లి నాయుడు, తుమ్మల చిన్నప్ప, ఎల్ వెంకటరాముడు, వై రమేష్ తదితరులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి



అంగన్వాడీల నిరసనలో మాట్లాడుతున్న ఈఎస్ వెంకటేష్



కదిరిలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు



పుట్టపర్తిలో నిరసనలో పాల్గొన్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - సోమందేపల్లి

అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమందేపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టులో అంగన్వాడీలు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం 42 రోజుల పాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించారన్నారు. ఆసమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని కూటమి నాయకులు అన్నారని ఇంతవరకు వారి సమస్యల పట్ల కనీస స్పందన కూడా కన్పించలేదని విమర్శించారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా చలో విజయవాడ నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. అనంతరం వినతులతో కూడిన వినతి పత్రాన్ని ప్రాజెక్టు కార్యాలయంలో అధికారి రామాంజనేయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి శ్రీదేవి , పద్మావతి, రాధమ్మ, సావిత్రి, విజయలక్ష్మి, నాగమణి నాగరత్నతో పాటు అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : అంగన్వాడీల కు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోల హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసంఘం జిల్లా కార్యదర్శి జిఎల్ నరసింహులు,లక్ష్మీనారాయణ, వివి రమణ, ప్రాజెక్ట్ కార్యదర్శిరంగమ్మ, ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ ఆధ్వర్యంలో మహ్మదాబాద్ క్రాస్‌లో ఉన్న ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సోమవారం నిరసనకు దిగారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లతో కూడా వినతిపత్రాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కుల్లాయప్ప అంగనవాడీ లీడర్లు మణిమాల, నాగమణి. వరలక్ష్మి, షమీం, కిష్టమ్మ, మేరీ సుజాత, పద్మావతి , లక్ష్మీదేవి, సరళ, పద్మ, సునీత భాయ్ అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు సోమవారం నల్లచెరువు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం నల్లచెరువు మండల కన్వీనర్ రామకృష్ణతో పాటు అంగన్వాడీ టీచర్లు భాగ్యమ్మ, పద్మావతితో పాటు మూడు మండలాల అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఐసిడిఎస్ పీడీ కార్యాలయం ముందు ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిఐటియు మండల నాయకులు బ్యాల్ల అంజి ,అంగన్వాడి సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఐసిడిఎస్ పీడీ కార్యాలయం వద్ద రెండు గంటలపాటు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బాళ్ల అంజి మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా అంగన్వాడీ కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో 42 రోజులపాటు ఆందోళన చేపట్టినా ,ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, సమ్మె ముగింపు సందర్భంగా 2024 లో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి దాన్ని విస్మరించారని అన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ అంగన్వాడి సెంటర్లుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పుట్టపర్తి సిడిపిఒ గాయిత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో సోమవారం ధర్మవరం ఐసిడిఎస్ ఆఫీసు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మండల కో కన్వీనర్ అయూబ్ ఖాన్, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్. బాషా, హైదర్ వలీ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సరస్వతి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ అనేక రకాల హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు పోతక్క.దీనా, విజయలక్ష్మి, అధికసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా డిమాండ్ చేశారు.ఈ మేరకు అంగన్వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మహాబున్నీసా, సిఐటియు నాయకులు బాబ్ జాన్, ముస్తాక్ అలీ ఖాన్, అంగన్వాడి యూనియన్ నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్ : అంగన్వాడి వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ శ్రీధర్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ , ఉపాధ్యక్షులు పెదపల్లి బాబా, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు జయమ్మ, కార్యదర్శి బావమ్మ, కోశాధికారి మాబునిస, సెక్టార్ లీడర్లు సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు స్థానిక ఐసిడిఎస్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు రమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు వాసంతి మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు వసంత భారతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : స్థానిక సిడిపిఒ కార్యాలయం ముందు సోమవారం అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలు మార్లు ప్రభుత్వాన్ని కోరినా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులకు వినతిపత్రం అందజేశారు.

హిందూపురం : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని సిఐటియు, అంగన్వాడీ యూనియన్ నాయకులు హెచ్చరించారు. సోమవారం పూలకుంట వద్ద ఉన్న ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వీరి ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, శ్రీరామ్ రెడ్డి వాటర్ సప్లై వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సోము, మురళి, నాయకులు మహానంది, చిన్నపరెడ్డి, మల్లికార్జున, గిరీష్, నారాయణప్ప మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, కో కన్వీనర్ రామకృష్ణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి శోభారాణి, అధ్యక్షులు అరుణ, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు శైలమ్మ, భారతి, పద్మక్క, నాగమ్మ, రూప తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అన్ని చెరువులనూ నీటితో నింపుతాం

ఎమ్మెల్యే పల్లె సింధూర



లైనింగ్ పనుల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి

ప్రజాశక్తి - బుక్కపట్నం

రాయలసీమను సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.మండల పరిధిలోని జానకంపల్లి వద్ద రూ. 425 కోట్లతో హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని విమర్శించారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ చేయడం వల్ల రైతులకు ఎలాంటి నష్టం ఉండదని దీనివల్ల 1 టిఎంసి నీరు పొదుపు అవుతుందని అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గం లో 193 చెరువులతోపాటు రెండు రిజర్వాయర్లు నింపడానికి కాలువల ద్వారా నీరు పారి భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు దీనివల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. రాయలసీమ మరో కోస్తా ఆంధ్రగా మారుతుందని అన్నారు. మాజీ మంత్రిపల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ లైనింగ్ పనులను వంద రోజుల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో బిఎస్సార్ కంపెనీ ముందుకు వచ్చిందని, నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ వల్ల కొన్నిచోట్ల బ్రిడ్జిలు లేకపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు, బ్రిడ్జిలు సత్వరమే నిర్మించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్, ఇరిగేషన్ ఎస్ఇ స్వరూప్, ఈఈ మురళి, డీఈలు వేణుగోపాల్ రెడ్డి, ప్రసాద్ రావు, తహశీల్దార్ షాబుద్దీన్, మండల కన్వీనర్ మల్లి రెడ్డి, టౌన్ కన్వీనర్ జంగం వెంకటరాముడు, నాయకులు సామకోటి ఆదినారాయణ , గంగాధర్, మాజీ సర్పంచి సాకే యశోద, వెంకటనారాయణ రెడ్డి, బాలు , సయ్యద్ భాష, మంజు, సుధీర్ కూటమి నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు

స్థలం కేటాయించండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

విభిన్న ప్రతిభావంతుల సమాఖ్య భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఫాదర్ ఫెర్రర్ విభిన్న ప్రతిభావంతుల మండల సమైక్య సభ్యులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం బత్తలపల్లిలోని రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ స్వర్ణలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య అధ్యక్షులు వేణుగోపాల్, ఉపాధ్యక్షులు గడుపూటి జనార్ధన్ నాయుడు తదితరులు మాట్లాడుతూ మండల సమాఖ్యను విభిన్న ప్రతిభావంతులంతా కలిసి2006లో ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు విభిన్న ప్రతిభావంతుల భవనానికి స్థలం కేటాయించలేదన్నారు. సమాఖ్య కార్యక్రమాల నిర్వహణ సమావేశాలు అద్దె భవనంలో నిర్వహించుకుంటున్నామన్నారు.మండలంలోని ప్రతి గ్రామంలోనూ విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వం, ఆర్టీటీతో చర్చించి సమస్యలు పరిష్కరించుకుంటున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి మండల సమాఖ్యకు కనీసం ఐదు సెంటు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - కదిరి టౌన్



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నాయకులు

పట్టణంలోని ఆరో వార్డు పాత,కొత్త అమీన్ నగర్ లో బాడుగ ఇళ్లల్లో ఉన్న 150 మంది నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆయా కాలనీలవాసులు సోమవారం కదిరి ఆర్డీవో కార్యాలయం నందు నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ టీఎస్ .చేతన్ కి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కి వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బత్తల సాంబశివ ,పట్టణ కార్యదర్శి జగన్మోహన్, కెవిపిఎస్ జిల్లా నాయకులు నారాయణ,సిపిఎం నాయకులు కృష్ణ నాయక్, ఐద్వా నాయకురాలు లక్ష్మీనరసమ్మ, ఇళ్లస్థలాల సాధన పోరాట కమిటీ సభ్యులు రవణమ్మ, షాహిదా ,రబియా, మాధవి గాయత్రి ,భవాని, ఆదిలక్ష్మి అంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారి నుంచి స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డు గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్న, ప్రభుత్వ కార్యాలయాలకు భవన నిర్మాణాలకు కావాల్సిన స్థలం లేదని అధికారులు చెబుతూ ఉంటారన్నారు. అయితే ప్రభుత్వ భూమిని దర్జాగా ఆక్రమించిన భూ కబ్జాదారుల నుంచి భూమిని స్వాధీనం చేసుకుంటే ఆ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. స్వాతంత్ర్య సమరయోధునికి సంబంధించి 14.60 ఎకరంలు అన్యక్రాంతమైందన్నారు. అలాగే కొత్తచెరువు పొలం 438-1లో 163 ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జాలో ఉందన్నారు. ఈ భూములను పంచాలని లేనిపక్షంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిరుపేదలకు పంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శంకర్, చంద్ర, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలపై దర్యాప్తు జరిపించాలి : టిడిపి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలో ప్రభుత్వ స్థలాలు, భూముల కబ్జా పై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ డిమాండ్ చేశారు. సోమవారం కదిరిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీఎస్ చేతన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారుల సహకారంతో ఖాళీ స్థలాలు కనపడితే చాలు కబ్జాలకు పాల్పడ్డారని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి కబ్జాదారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - రొద్దం

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను మండలంలోని రొద్దం టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సి వై ఆర్ సి ప్రాగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సిబ్బంది మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మదర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, టీచ్ హైస్కూల్ పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, దాదాపు 40 రకాల నమూనాలను ప్రదర్శించారు. నైపుణ్యం కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టింబక్టివ్, కలెక్టివ్ సంస్థ సిబ్బంది, ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి - రొద్దం

పెనుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రొద్దం మండల పరిధిలో సోమవారం మొరాయించింది. రొద్దం సమీపంలో మారెమ్మ దేవాలయం వద్ద ఇంజన్ సమస్యతో బస్సు నిలిచిపోయింది. అందులో ఉన్న దాదాపు 30 మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గ్రామ సమీపంలోనే దేవాలయం వద్ద బస్సు నిలిచిపోవడంతో అక్కడే ఉన్న చెట్టు నీడకు ప్రయాణికులకు చేరారు. అసలే ఎండాకాలం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు నిలిచిపోయిన తర్వాత దాదాపు అరగంటకు మరో బస్సు రావడంతో ప్రయాణికులను అందులో ఎక్కించి పావుగడ వైపు పంపించారు. ఎండాకాలం కండిషన్ లో ఉన్న బస్సులను నడిపి ప్రయాణికులకు అవస్థలు తప్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్సు చెడిపోవటంతో చెట్టు కింద కూర్చొన్న ప్రయాణికులు

దోపిడీ దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

రహదారుల్లో కాపుగాచి దోపిడీకి పాల్పడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి నుండి రూ. 33 వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు హిందూపురం డిఎస్పి కెవి. మహేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగల అరెస్టు వివరాలను వెల్లడించారు. హిందూపురం పట్టణంలోని ఎస్.సడ్లపల్లికి చెందిన ఏ. నాగరాజు, ఏ.గంగాధర్, శివకుమార్, టి.వెంకటేష్ లు చెడు వ్యసనాలకు బానిసలై అక్రమ సంపాదనపై దృష్టి సారించారన్నారు. పట్టణ శివారు ప్రాంతాల్లో వెళుతున్న ద్విచక్ర వాహనదారులను ఆపి వారిని భయభ్రాంతులకు గురిచేసి వారి నుండి నగదు లాక్కోవడం, లేనిపక్షంలో ఫోన్ పే ద్వారా వారి ఖాతా నుండి తమ ఖాతాల్లోకి నగదును వేయించుకోవడం చేసేవారన్నారు. పలుమార్లు గుర్తు తెలియని వ్యక్తుల నుండి ఇదే తరహాలో వ్యాపకాలు సాగించారని పేర్కొన్నారు. అయితే దీనిపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన అనంతపురం జిల్లా పామిడి మండలం పి. కొండాపురానికి చెందిన కుళ్లాయప్ప అనే వ్యక్తి శాస్త్రం చెప్పుకుంటూ జీవనం సాగిస్తుండగా హిందూపురానికి వచ్చిన నేపథ్యంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఆయన్ను నిందితులు సడ్లపల్లి చెరువు వద్ద శివారు ప్రాంతంలోకి తీసుకెళ్లి దాడి చేసి అతని వద్దనున్న రూ.500 లాక్కోవడంతోపాటు హతమారుస్తామని బెదిరించి రూ 32,500 ఫోన్ పే ద్వారా తమ ఖాతాల్లోకి వేయించుకున్నారన్నారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు. సోమవారం అందిన సమాచారంతో సీఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, జనార్ధన్, ఎస్ఐ బ్రహ్మానందరెడ్డి, ఎఎస్ఐ అక్బర్ సాబ్, కానిస్టేబుళ్లు సుబ్రహ్మణ్యం, జనార్ధన్, సాయి, చంద్ర, అశోక్, సుధాకర్, రాజులు దాడులు నిర్వహించి సూగూరు గేట్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతోపాటు నగదు, సెల్ ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

తల్లి చెంతకు తప్పిపోయిన బాలుడు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రైల్వేస్టేషన్ లో అనుమానాస్పదంగా తిరుగుతున్న 8 ఏళ్ల బాలుడిని చేరదీసి టూ టౌన్ ఇన్‌ఛార్జి సిఐ జనార్ధన్ ఆధ్వర్యంలో తల్లి చెంతకు సోమవారం చేర్చారు. ముఖేష్ సింగ్ అనే 8 ఏళ్ల బాలుడురైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండగా పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి వివరాలను సేకరించారు. బాలుడు ఇచ్చిన సమాచారం మేరకు తల్లి సరితా దేవి నుంచి బెంగళూరు సిటీ యలహంకలో తప్పిపోయి హిందూపురం రైల్వే స్టేషన్ కు వచ్చినట్లు గుర్తించారు. వెంటనే తల్లికి సమాచారం ఇవ్వడంతో సాయంత్రం ఆమె ఇక్కడకు చేరుకుంది. పూర్తిస్థాయిలో వివరాలను గుర్తించిన పోలీసులు బాలుడిని తల్లి సరితా దేవికి అప్పగించారు. తప్పిపోయిన తన కుమారుడిది అప్పగించడం పట్ల తల్లి సరితా దేవి, కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి : ఎంపీ

రొద్దం : మండలంలో నెలకొన్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని హిందూపురం ఎంపీ బికె పార్థసారథి ఆదేవించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజ్, ఎంపీడీవో రామ్ కుమార్ ఎంపీ బీకే పార్థసారథిని ఆయన స్వగృహంలో కలివారు. అక్కడే ఉన్న మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పలు సమస్యలును ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలనిఅధికారులను ఆదేశించారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు : డిఆర్ఒ

పుట్టపర్తి అర్బన్ : ప్రజా సమస్యలపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చూపరాదని జిల్లా రెవిన్యూ అధికారి విజయసారధి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 123 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ గడువులోగా ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి అధికారి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని సూర్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు లోకేష్, మెహరున్నీషా రాష్ట్ర స్థాయిలో జరిగే హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా వారిని సోమవారం పాఠశాల యాజమాన్యం అభినందించింది, ప్రధానోపాధ్యాయులు నరేంద్ర మాట్లాడుతూ ధర్మవరంలో జరిగిన సెలెక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభను ప్రదర్శించిన ఈ విద్యార్థులు ఇద్దరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు.

వైరస్‌పై ఆందోళన వద్దు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

జిబిఎస్ గురించి ఆందోళన చెందొద్దని సత్య సాయి జిల్లా ప్రజలకు జిల్లా వైద్యాధికారిని ఫైరోజ్ బేగం భరోసా కల్పించారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యాధి చాలా అరుదైనదని అంటువ్యాధి కాదని అన్నారు, వైరస్, బాక్టీరియా సంక్రమణ తరువాత ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందని, వ్యాధి లక్షణాలు వేగంగా తీవ్రతరం అవుతాయన్నారు.